ఆ రోజెందుకో అయిదో నంబరు సిటీబస్సు చాలా రష్‌గా ఉంది. అయినా క్యూలో ముందుగా వుండటం వల్ల సీటు దొరికింది. అదీ కిటికీ పక్కన. మళ్ళీ ఎవరో ఆక్రమించు కుంటారని ఆత్రంగా దబ్బున కూలబడ్డాను. కాసేపటికి నా పక్కన మరో శాల్తీ కూలబడింది. టికెట్ తీసుకునే తొందర్లో పక్కన కూర్చున్న ఆకారాన్ని గమనించలేదు. కండక్టరు దూరంగా లేడీస్ సీట్లలో రెండో వరుస దగ్గర ఉన్నాడు. అతను మా సీటు దగ్గర కొచ్చేంతవరకూ టైం పాస్‌కావాలి కదా! ఎలా? ఏంచేద్దాం? ఆ కం డక్టరు పనినే గమనిస్తే పోలా! అనుకుంటూ అటే దృష్టి పెట్టాను.

ఎవరు ఏ నోటు ఇచ్చినా టికెట్ ఇస్తూ చిల్లరేమీ ఇవ్వకుండా వెనక్కు తిప్పి కింద ఎడ మ పక్క రైటులా మార్కుపెట్టి ఇస్తున్నాడు. కండక్టరు టికెట్‌మీద ఏమి రాస్తున్నాడా అని అను మానం వచ్చింది. కానీ దూరంనించి కనబడ టం లేదు. దగ్గరకొచ్చాక చూడొచ్చులే అని అలాగే అతనిని, అతని పనినీ చూస్తున్నాను. చూస్తుచూస్తూండగానే మా సీటు దగ్గరకొచ్చే సాడు. అప్పుడు గమనించాను. ఆ రైటు మార్కు ప్రక్కన 10, 20, 50, 100 అని నోటు వివరా లు వ్రాస్తున్నాడు. పోనీలే అక్కడికదయినా మేలే అని చూద్దునుకదా అప్పటిదాకా 30 మందికి టికెట్లు ఇచ్చుంటాడతను. కానీ ఒక్కళ్ళకూ చిల్లర ఇవ్వలేదు. డిపోలో తీసుకున్న చిల్లర ఉం టుంది కదా! ఎందుకివ్వటం లేదు? అంతలో నన్నడిగాడు. టిక్కెట్ టిక్కెట్ అంటూ సరిపడా డబ్బులు చేతిలో వుంచుకున్నందువల్ల ఆ డబ్బు



# తాడి తన్నేవాడు తల తన్నేవాడు

లతనికిచ్చి స్టేజి చెప్పాను. చిల్లర లెక్కపెట్టుకుని, టికెటు చించి కోపంగా (నోటు ఇయ్యనందు కా?) నా చేతిలో కుక్కేసాడు. పక్క శాల్తీని అడు గుతున్నాడు మీరెక్కడికెళ్ళాలని? అప్పుడు చూ శాను పక్క శాల్తీని. 25 నుంచి 30 ఏళ్ళలోపు లో ఉంటాయి. చదువుకున్నవాడిలాగానే వున్నా డు. అతనూ నాలాగే సరిగా టికెట్‌కి సరిపడా డబ్బులిచ్చాడు. స్టేజి చెప్పాడు. కండక్టరు టికె టు చించి అతని చేతిలో కుక్కేసాడు కోపంగానే!

మా సీటు దగ్గరి నుంచి వెనుక మరో 30 నుంచి 35 మందికి టికెట్లిచ్చి వెనక తలుపు దగ్గర మెట్ల మీద నిలబడ్డాడు కండక్టరు. ఆ 30-35 మందిలో ఇద్దరు ముగ్గురు మాలాగే సరిగా టికెటు డబ్బులిచ్చారు. మిగతావారు నోట్లిచ్చినా ఇతగాడు చిల్లరేమీ ఇవ్వలేదు. టికె టు వెనక రైటుమార్కు వగైరా వగైరా... ఇంత లో రెండు మూడు స్టేజీలు వెళ్ళిపోయాయి. దిగేవాళ్ళు దిగుతున్నారు. చిల్లర కోసం టికెటు చూపినవారికి తోచినంత ఇచ్చి బలవంతంగా కిందకి గెంటేస్తున్నాడు. అన్నా! ఇంతన్యాయ మా? అని నోటి మీద వేలుంచుకుని అలాగే చూస్తూకూర్చున్నాను.

ఇంతలో "మాస్టారూ! ఒకసారి పెన్ను ఇస్తా రా?" అన్న పక్కశాల్తీ మాటలకు ఈ లోకంలో కొచ్చాను. పెన్నుతీసి అతనికిచ్చి ఏం చేస్తాడా? అని చూడసాగాను. మెల్లగా జేబులోపలి నుంచి టికెటు బయటకు తీశాడతను. ఏదయినా ఫో ను నంబరో, అడ్రసో రాసుకుంటాడులే అను కుని చూస్తూనేవున్నాను. పక్కశాల్తీ టికెటు వెనక్కి తిప్పాడు. క్రింద ఎడమ పక్కన రైటుమా ర్కు పెట్టాడు కండక్టరు పెట్టినట్టే! నోటి మీదున్న వేలుతీసేసి చేయి పెట్టుకుని 'అరి! దుర్మార్గుడా!' అనుకున్నాను. అతన్ని మళ్ళీ కింద నుంచి పైకి చూశాను. చూస్తుండగానే ఆ రైటు పక్కన 100 అని కలిపి రాతలో రాసేశాడు. "ఓరి నీ అసా ధ్యంకూలా! ఎంతకు తెగించావురా!" అని లబ లబ లాడాను (మనసులోనే). సరిగా టికెట్‌కి సరిపడా డబ్బు ఇచ్చి, టికెటు తీసుకున్నతను అంత అన్యాయం ఎందుకు చేస్తాడులే! ఏదో రాసుకుంటున్నాడనుకున్నాను.

ఇంతలో తర్వాతి స్టేజి సమీపిస్తుండగానే నా పెన్ను నాకిచ్చేసి, పరుగుతో కండక్టరు దగ్గరకెళ్ళి అతని చేతిలో తన టికెట్ కుక్కేసి "మా ఫ్రెండ్ ఇటే వెళ్తున్నాడు. ఇక్కడే దిగిపో తాను చిల్లరిచ్చేయండి" అన్నాడు. 'అయ్యో అనుకున్నంతా అయిపోతోందే!' అని మళ్ళీ లబలబలాడాను. కండక్టరు టికెట్ వెనక్కి తిప్పి చూసి, రైటు మార్కు, నోటు సంఖ్య తానే వేసా ననుకుని ఒక 50 నోటు రెండు 20 నోట్లు ఇచ్చి అతి మర్యాదగా 'నాలుగు రూపాయలు చిల్లరలేదు సార్' అన్నాడు. పక్కశాల్తీ ఎంతో ఉదారంగా "ఫరవాలేదు లెండి... చిల్లర లేకుం టే మీరేం చేస్తారు!" అంటూనే స్టేజి దగ్గర ఆగ కుండానే నడుస్తున్న బస్సులోంచి దూకేసాడు. ఆరు రూపాయలు ఖర్చుచేసి తొంబయి రూపా యలు సంపాదించాడు. పదిహేను రెట్ల లాభం! తాడినితన్నే వాడుంటే వాడి తలను తన్నేవాడు మరొకడుంటాడని ఊరికే అన్నారా మరి? ●

**జి. ప్రభాకరరావు**